

చందుర్తి: బీరప్ప ఆలయంలో పూజలు చేస్తున్న బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చా చల్మెడ


# కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం

ఆందోళన చెందుతున్న రైతులు



గంభీరావుపేటలో..

**అకాల వర్షం రైతన్నను అతలాకుతలం చేస్తున్నాయి. మంగళ వారం రాత్రి, బుధవారం కురిసిన అకాల వర్షానికి కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యం నీటి పాలైంది. జిల్లాలో ఆయా కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యం తడిసి ముద్దయింది. కొనుగోళ్లలో జాప్యం, టార్పాలిన్లు లేక రైతులు నానా ఇబ్బందులు పడ్డారు. ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలని రైతులు వేడుకున్నారు.**



వీర్నపల్లి: తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టిన రైతులు

కోనరావుపేట, మే 7 : మండలవ్యాప్తంగా అకాల వర్షం కురియడంతో అన్నదాత ఆగమాగమవుతున్నాడు. నిజామాబాద్, మామిడిపల్లి, కోనరావుపేట గ్రామాల్లో అత్యధిక వర్షం కురియడంతో కొనుగోలు కేంద్రంలోని ధాన్యం తడిసి ముద్దయ్యాయి. మంగళవారం రాత్రి ఈదురుగాలలు , దానికి తోడు భారీ వర్షం కురియడంతో రైతులు కొనుగోలు కేంద్రాలకు వెళ్లాలేకపోయారు. దీంతో ధాన్యం తడిసి పోవడంతో పాటు సెంటర్లలో వర్షపు నీరు నిలిచిపోయింది. మరో వైపు తూకం వేసిన ధాన్యం బస్తాలు లారీలు సరిగా రాక సెంటర్లలో నిల్వ ఉండిపోవడంతో బస్తాలు తడిచిపోయాయి. వర్షాలు పడుతున్న నేపథ్యంలో అధికారులు పట్టించుకోకుండా ధాన్యం తరలించడంలో జాప్యం చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. నిజామాబాద్ గ్రామంలో ధాన్యం పోసి రెండు నెలలు కావస్తున్నా నిర్వాహకులు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. సీరియల్ లేకుండా ఇష్టం వచ్చిన రీతిలో కొనుగోళ్లు చేస్తుండడంతో రైతులు ఇబ్బందులకు పడుతున్నారన్నారు. సెంటర్ నిర్వాహకులపై అధికారులు దృష్టిపెట్టి ధాన్యం కొనుగోళ్లు జరిగేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

రుద్రంగి, మే 7 : మండలకేంద్రంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. మండలకేంద్రంలోని మార్కెట్ యార్డులో, సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో అరబోసిన ధాన్యం మ్యాచర్ వచ్చినప్పటికీ కొనుగోలు చేయకపోవడంతో వర్షానికి తడిసి ముద్ధయింది. పలువురి రైతుల ధాన్యం వర్షానికి కొట్టుకుపోయింది. కొనుగోలు కేంద్రాల్లో మ్యాచర్ వచ్చినప్పటికీ కొనుగోలు చేయకపోవడంతో పంట నష్టపోయామని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షానికి తడిచిన ధాన్యంను కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.



రుద్రంగిలో..

వీర్నపల్లి, మే 7 : ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకునేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. మండలంలోని అడవిపదిర, లాల్‌సింగ్‌తండా, వీర్నపల్లి, గర్జనపల్లిలో ధాన్యం కొనుగోలు ప్రక్రియలో జాప్యం చేయగా, అకాల వర్షాలు రైతులను ఆగమాగం చేస్తున్నాయి. బుధవారం ఉదయం కురిసిన వర్షానికి పలు గ్రామాల్లో ధాన్యం తడిసింది. తడిసిన ధాన్యాన్ని అరబెట్టే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని వారు డిమాండ్ చేశారు.



కోనరావుపేట : తడిసిన ధాన్యాన్ని ఆరబోస్తున్న రైతులు

గంభీరావుపేట, మే 7 : మండలకేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో కురిసిన అకాల వర్షానికి ధాన్యం తడిసి ముద్దయ్యాయి. కేంద్రాల్లోని ఆరబెట్టిన ధాన్యంతో పాటు కొనుగోలు చేసి తూకం వేసిన ధాన్యం బస్తాలు సైతం నాలుగు రోజులుగా కేంద్రాల్లోనే ఉండడంతో వర్షానికి అవి కూడా తడిసి పోయాయి. తదితర సమస్యలతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మిన అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు.

అకాల వర్షం .. విద్యుత్ అంతరాయం

చందుర్తి, మే7: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో అకాల వర్షానికి విద్యుత్ అంతరాయం మంగళవారం రాత్రి ఈదురు గాలులతో కురిసిన వర్షానికి లింగంపేట– సనుగుల రహదారిలో చెట్లు విరిగి విద్యుత్ స్తంభాలపై పడడంతో కరెంటు వైర్లు నేలకొరిగాయి. ప్రజలు ఎవరూ అక్కడ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. విద్యుత్ వైర్లు తెగిపోవడంతో లింగంపేటలో విద్యుత్ సరపరకు అంతరాయం ఏర్పడింది. సెస్ సిబ్బంది మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. అలాగే మర్రిగడ్డ ఎన్గల్ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల్లో దాన్యం తడిసి ముద్ద కాగా, రైతులు ధాన్యాన్ని ఆరబెట్టారు.

## ఆలయాల్లో చల్మెడ ప్రత్యేక పూజలు

వేములవాడ రూరల్/చందుర్తి, మే 7: మండలంలోని జోగాపూర్ గ్రామంలోని బీరప్ప ఆలయంలో బుధవారం స్వామి వారి కల్యాణ మహోత్సవంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారి ఆశీస్సులతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకొన్నారు. జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు తోట ఆగయ్య, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఎల్లయ్య, మాజీ జడ్పీటీసీ నాగం కుమార్ నాయకులు రాఘవరెడ్డి,చిలుక పెంటయ్య మరాటి మల్లిక్ ఉన్నారు. వేములవాడ రూరల్ మండలంలోని రుద్రవరం గ్రామంలోని గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రేణుకాఎల్లమ్మ జాతర మహోత్సవంలో బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మ్యాకల రవి, సెస్ డైరెక్టర్ హరిచరణ్ రావు, సీనియర్ నాయకులు ఆర్‌సీరావు, హరికృష్ణ, కట్ట తిరుపతి, రాజిరెడ్డి, పర్శరాములు, బండారి శ్రీనివాస్, రవి, నరేశ్ తదితరులు ఉన్నారు.

**ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం**

కోనరావుపేట, మే 7 : మండలంలోని మర్తనపేట గ్రామంలో శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, వేములవాడ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఇక్కడ మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చుకాయల ఎల్లయ్య, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు మల్యాల దేవయ్య, పాషా, మాజీ సర్పంచ్ వంశీకృష్ణ రావు, నేతలు పాల్గొన్నారు.

## రైతులకు సేవ చేయడమే సహకార సంఘం లక్ష్యం

**సహకార సంఘం చైర్మన్, కేడీసీసీబీ డైరెక్టర్ తిరుపతిరెడ్డి**



మాట్లాడుతూన్న తిరుపతిరెడ్డి

వేములవాడ రూరల్, మే 7 : రైతులకు సేవ చేయడమే సహకార సంఘం లక్ష్యమని వేములవాడ ప్రాథమిక సహకార సంఘం చైర్మన్, కేడీసీసీబీ డైరెక్టర్ ఏనుగు తిరుపతిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం వేములవాడ ప్రాథమిక సహకార సంఘం పాలకవర్గ సభ్యులతో సమావేశం అనంతరం ఆయన మాట్లాడుతూ, రైతులకు సేవ చేయడమే లక్ష్యంగా సొసైటీ పనిచేస్తుందని, ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సిబ్బందికి ఆదేశించారు. సహకార పరిధిలోని ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ఇపట్పి వరకు 63 వేల 466 క్వింటాళ్లను కొనుగోలు చేశామన్నారు. రైతుల కోసం సహకార సంఘాలు నిరంతరం పనిచేస్తున్నాయన్నారు. సోషల్ మీడియా వేదికగా ఓ రైతు ధాన్యం సెంటర్ వద్ద వీడియో తీసి సొసైటీని, సిబ్బందిని అగౌరవ పరిచే విధంగా మాట్లాడటం బాధ కలిగించిందన్నారు. రైతులకు ఇబ్బంది కలిగితే నేరుగా తమను సంప్రదించవచ్చన్నారు. సీఈవో లక్ష్మణ్, వైస్ చైర్మన్ కాంతరావు, డైరెక్టర్లు రాజు, వెంకటేశం, అమృత, మల్లేశం, సంజీవ్‌రెడ్డి, లచ్చిరెడ్డి, సురేందర్‌రెడ్డి, భూలవ్వ, రాజయ్య, రమేశ్ ఉన్నారు.

## మెరుగైన వైద్య సేవలు అందించాలి

గంభీరావుపేట, మే 7: ఆరోగ్య కేంద్రానికి విచ్చేస్తున్న రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి రజిత సూచించారు. మండలంలోని లింగన్నపేట ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం జిల్లా వైద్యాధికారి సందర్శించారు. రోజు వారీగా అందిస్తున్న ఓపీ సేవలు, రికార్డులు, సదుపాయాలను వారు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి వేణుగోపాల్‌రెడ్డి, సీహెచ్‌వో రమేశ్, ఏఎన్‌ఎంలు, సిబ్బంది ఉన్నారు.

## వేర్వేరు ఘటనలో ఇద్దరు వ్యక్తుల ఆత్మహత్య



ఒగ్గు మహేశ్(ఫైల్)



రామ్‌కుమార్(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, మే 7: పెళ్లి కావడం లేదనే బెంగతో మండలకేంద్రానికి చెందిన ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం జరిగింది. ప్రొబేషనరీ ఎస్ఐ లక్ష్మణ్ అందించిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఒగ్గు మహేశ్(23)కు కొంత కాలంగా పెళ్లి చూపులు చూస్తున్నప్పటికీ సంబంధాలు క్యాన్సల్ అవుతూ వస్తున్నాయి. దీంతో మనస్థాపానికిలోనైన మహేశ్ ఎల్లారెడ్డిపేట శివారులో ఓ చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి రాజవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు.

**కేసీఆర్‌నగర్‌లో ఆర్థిక ఇబ్బందులతో..**

సిరిసిల్ల రూరల్, మే 7: తంగళ్లపల్లి మండలం మండెపల్లి శివారులోని కేసీఆర్‌నగర్‌లో మరొకరు ఆర్థిక ఇబ్బందులు తాళలేక బలవన్మరణానికి పాల్పడ్డాడు. కేసీఆర్‌నగర్‌కు చెందిన తాడూరి రామ్‌కుమార్(38) ఉరేసుకొని బుధవారం ఇంట్లో ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. వరంగల్‌కు చెందిన రామ్‌కుమార్ 14 ఏండ్ల క్రితం వేములవాడ పట్టణానికి చెందిన అనితను కులాంతర వివాహం చేసుకున్నాడు. అప్పటి నుంచి పెద్దలకు దూరంగా ఉంటూ, సిరిసిల్లలో జిరాక్స్‌మిషన్ మెకానిక్‌గా పనిచేస్తూ, తన తమ్ముడితో మ్యారేజ్ ఈ వెంట్లను చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. వారికి ముగ్గురు కుమారులున్నారు. ముగ్గురు కొడుకులు పుట్టగానే, ఆ సమయంలో వైద్య ఖర్చుల కోసం సుమారు రూ. 3 లక్షల అప్పులు చేశాడు. గతంలో రాంకుమార్ భార్య అనిత ఓ ప్రైవేట్ దవాఖనలో నర్సుగా పనిచేయగా, కరోనా సమయంలో పని మానేసింది. ఆసమయంలో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయని భార్య అనిత తెలిపింది. చేసిన అప్పులు ఎలా తీర్చాలో అంటూ మనోవేదనకు రాంకుమార్ కొంతకాలంగా మనోవేదనకు గురవుతున్నాడు. రెండు రోజుల క్రితం మ్యారేజ్ ఈవెంట్‌కు వరంగల్‌కు వెళ్తున్నా అని చెప్పి వెళ్లి, తిరిగి బుధవారం ఉదయం నాలుగు గంటల ప్రాంతంలో ఇంటికి తిరిగి వచ్చాడు. మధ్యాహ్నం సమయంలో పెద్దకొడుకు సుఖజీతో బట్టలు సర్దుకోనాని మనం ఊరికి వెళ్దామంటూ చెబుతూ ఇద్దరి తమ్ముళ్లను బాగా చూసుకోమని చెప్పినట్లు పెద్దకొడుకు తెలిపాడు. ఇంతలో గదిలోకి వెళ్లి డోర్ వేసుకొని, కాసేపటికి తర్వాత ఎంత పిలిచినా డోర్ తీయకపోవడంతో పక్కింటి వారి సాయంతో డోర్ పగలగొట్టి చూడగ, ఉరేసుకొని కనపించాడని భార్య రోధిస్తూ వివరించింది. ఇన్‌చార్జి ఎస్ఐ వినితా రెడ్డి, పోలీసుల సిబ్బందితో చేరుకుని మృతదేహన్ని పరిశీలించారు. భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, విచారణ చేస్తున్నామని తెలిపారు.



విద్యార్థులతో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

### ప్రతిభ చూపిన విద్యార్థులకు సన్మానం

బోయినపల్లి రూరల్, మే7: ఇటీవల విడుదలైన పదో తరగతి, ఇంటర్మీడియెట్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను బుధవారం చొప్పదండి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అభినందించి, శాలువాతో సన్మానించారు. మాజీ మండల కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ అజ్జు, బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ బత్తిని కమల్‌గౌడ్, కల్లపెల్లి కృష్ణమూర్తి, మండల బీఆర్ఎస్ బీసీసెల్ అధ్యక్షుడు గురిజాల కోటి, గొండ సుధాకర్, ర్యాగల్ల బాలకిషన్, గురిజాల శ్రీనివాస్, తిరుపతి, వెంకటేశ్, అక్షయ్, లింగారావు ఉన్నారు.



### పెళ్లిరోజు గుర్తుగా మొక్క నాటిన దంపతులు

బోయినపల్లి రూరల్, మే 7 : తడగొండ గ్రామానికి చెందిన చిందం రమ–తిరుపతి దంపతులు వారి పెళ్లిరోజు సందర్భంగా వారి పంట చేను వద్ద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మాజీ రాజ్యసభసభ్యులు జోగినపల్లి సంతోష్‌కుమార్ తలపెట్టిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా ప్రకృతి హరిత దీక్ష భావితరాలకు రక్ష అంటూ, ప్రజలందరూ తమ పుట్టినరోజు, పెళ్లి రోజు వేడుకల్లో ఏదైనా శుభకార్యాలల్లో ఒక మొక్క నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో తడగొండ తాజా మాజీ సర్పంచ్ చిందం రమేశ్, శీలం తిరుపతిరెడ్డి, అన్నారం మల్లయ్య, విలాసాగర్ వెంకటేశ్, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

### రహదారి విస్తరణలో పరిహారం నిర్ణయించలేదు : కలెక్టర్

వేములవాడ, మే 7 : పట్టణంలోని ప్రధాన రహదారి విస్తరణలో ఒక గజానికి ధర ఎంత అని ఇప్పటికీ ప్రభుత్వం నిర్ణయించలేదని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం వేములవాడ మూలవాగు నుంచి రాజన్న ఆలయం వరకు 80 అడుగుల మేర చేపట్టనున్న విస్తరణలో భాగంగా చేస్తున్న భూసేకరణ పనులను క్షేత్రస్థాయిలో మాత్రమే పరిశీలించామన్నారు. ఒక గజానికి ఇంత పరిహారమని ఇప్పటివరకు ప్రభుత్వం నిర్ణయించలేదని స్పష్టం చేశారు. రోడ్డు డిజైన్, నిర్మాణ గడువు తదితర అంశాలపై కూడా ఎలాంటి ప్రకటన చేయలేదని ఆయన ప్రకటనలో తెలిపారు.

### సమస్యల పరిష్కారానికి కృషి

ఇల్లంతకుంట రూరల్, మే 7 : ప్రజాసమస్యల పరిష్కారం కోసమే ఎమ్మెల్యే ఆన్‌వీల్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని రహీంఖాన్‌పేట, వెల్జిపూర్, ఓబులాపూర్ గ్రామాల్లో ఎమ్మెల్యే ఆన్‌వీల్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలు నియోజకవర్గ కేంద్రంలోని క్యాంపు కార్యాలయానికి వచ్చి సమస్యలు చెప్పుకోలేరు, కాబట్టి ప్రజల సమస్యలను నేరుగా గ్రామాల్లోకి వచ్చి పరిష్కారం చేసేందుకే ఈ కార్యక్రమానికి రూపకల్పన చేసినట్లు పేర్కొన్నారు. ప్రజల నుంచి సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఫారుఖ్, ఎంపీడీవో శశికళ, మాజీ ఎంపీపీలు వెంకటరమణారెడ్డి, గుడిసె ఐలయ్య, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, ఐరెడ్డి మహేందర్‌రెడ్డి, ఎలగందుల ప్రసాద్ తదితరులున్నారు.

### అల్లూరి సీతారామరాజు వర్ధంతి

వేములవాడ, మే 7: వేములవాడ పట్టణంలోని న్యూ అర్బన్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో అల్లూరి సీతారామ రాజు 101వ వర్ధంతి వేడుకలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం విక్కుర్తి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర ఉద్యమంలో గిరిజనులతో కలిసి చేసిన తిరుగుబాటు, పోరాట స్ఫూర్తి ఇప్పటికీ ప్రజల్లో నిలిచిపోయాయి అని గుర్తు చేశారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దుర్శేటి లక్ష్మీనారాయణ, స్థానికులు తిరుపతి, కిషన్, విద్యార్థులు ఉన్నారు.



వేములవాడలో అల్లూరి సీతారామరాజు చిత్రటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

## పేదింటి ఆడబిడ్డలకు పుస్తె, మట్టెలు వితరణ



పుస్తె,మట్టెలు అందచేస్తున్న నాయకులు

ముస్తాబాద్, మే 7 : మండలంలోని మొర్రాయిపల్లె గ్రామంలో సడిమేల వెంకటి సత్తవ్వ దంపతుల కూతురు దేవిక వివాహానికి సడిమేల దేవవ్వ–దేవయ్య కూతురు అఖిల వివాహానికి, సడిమెల లలిత దేవయ్య కూతురు వివాహానికి మండలంలోని గూడెం గ్రామానికి చెందిన చిట్నేని మాధవి–వెంకటేశ్వర్ రావు దంపతులు పుస్తెలు వితరణ చేయగా, మూడు కుటుంబాలకు మాజీ ఎంపీపీ జనగామ శరత్ రావు మద్దికుంట మాజీ సర్పంచు భాగ్యశ్రీ ఒక్కొక్క కుటుంబానికి 50 కిలోల బియ్యం, చీటీ జితేందర్ రావు ప్రతి కుటుంబానికి రూ. రెండు వేలు, కల్వకుంట్ల ప్రసాద్ రావు, నరేందర్ రావు రూ. 2,200 కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేశారు. మొర్రాయి పల్లె మాజీ సర్పంచ్ సడిమెల సుజాత ఎల్లం, వెండి మట్టెలు అందించారు. కార్యక్రమంలో పాల్గొన్న సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి మాట్లాడుతూ, నిరుపేదల ఆడబిడ్డల పెళ్లికి చేయూతనివ్వడం అభినందనీయమన్నారు. ఆర్థిక సాయం అందించిన వారి కుటుంబాలకు నవ వధువు కుటుంబసభ్యులు, నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో, మొర్రాయిపల్లె మాజీ సర్పంచ్ సుజాత ఎల్లం, మాజీ సర్పంచ్ చిట్లేని శ్రీనివాస్ రావు, కిషన్, రాజానర్స్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పీహెచ్‌సీ తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారి రజిత



ఆవునూర్‌లోని ఆరోగ్య ఉపకేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా వైద్యాధికారి రజిత

ముస్తాబాద్, మే 7 : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎస్ రజిత పోతుగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు ఆవునూరు, గూడెం ఆరోగ్య ఉప కేంద్రాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, వైద్య సిబ్బందితో ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షించారు. సాధారణ ప్రసవాలు ప్రభుత్వ దవాఖానలో జరిపేందుకు ప్రోత్సహించాలని ఆశ కార్యకర్తలకు, సిబ్బందికి సూచనలు, సలహాలిచ్చినారు.

## కళాకారుల రౌండ్ టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయండి

వేములవాడ టౌన్ , మే : ఈ నెల 10న హనుమకొండలో నిర్వహించే ఉద్యమకళాకారుల రౌండ్‌టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఉద్యమకళాకారుల రాష్ట్ర కన్వీనర్ ఎల్ల పోశెట్టి కోరారు. బుధవారం వేములవాడ పట్టణంలోని కళాకారుల కేంద్ర కార్యాలయంలో ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ రావు ఆదేశాలమేరకు నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. మహిళా కళాకార బృందాలు, వివిధ సంఘాల నాయకులు రౌండ్‌టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## మద్యం మత్తులో యువకుడి వీరంగం



విద్యుత్ స్తంభానికి కట్టేస్తున్న స్థానికులు

వేములవాడ, మే 7: వేములవాడ పట్టణంలో బుధవారం మద్యం మత్తులో యువకుడు వీరంగం చేశాడు. వీఐపీ రహదారిలోని ఓ టిఫిన్ సెంటర్ వద్ద అతిగా మద్యం తాగిన యువకుడు పెద్దగా అరుస్తూ బండరాళ్లతో దాడి చేసే ప్రయత్నం చేశాడు. టిఫిన్ సెంటర్ వద్ద ఉన్నటువంటి వస్తువులను చిందరవందర చేస్తూ అక్కడికి వచ్చిన భక్తులపై దురుసుగా ప్రవర్తిస్తుండడంతో పరుగులు తీశారు. దీంతో హోటల్ సిబ్బంది పట్టుకొని విద్యుత్ స్తంభానికి కట్టి దేహశుద్ధి చేశారు. అయినప్పటికీ కూడా ఆ యువకుడు తాళ్లు తెంచుకొని అక్కడి నుంచి పరారయ్యాడు.

## చర్చి నిర్మాణం విషయంలో రభస

ఎల్లారెడ్డిపేట, మే 7 : రాజన్నపేటలో నిర్మిస్తున్న చర్చి విషయంలో స్థానికులతో పాటు బీజేపీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో రెండు వర్గాల మధ్య బుధవారం వాగ్వాదం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో పంచాయతీ అధికారుల అనుమతి తీసుకుని చర్చి నిర్మాణం చేసేందుకు ప్రయత్నం చేస్తుండగా, కొందరు స్థానికులు చర్చి ని ర్మాణంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇదే విశయాన్ని తెలుసుకున్న పలువురు బీజేపీ నాయకులు స్థానికులకు తోడవ్వడంతో క్రైస్తవులు కూడా అక్కడ గుమిగూడారు. పోలీసులు వారిద్దరినీ శాంతింపజేసినప్పటికీ చర్చి నిర్మాణంపై స్థానికులు ఠాణాలో ఫి ర్యాదు చేయగా, అనుమతులుండగా చర్చి వద్దకు వచ్చి గొడవ చేశారని క్రైస్తవులు కూడా ఠాణాలో ఫిర్యాదు చేశారు. పరస్పరం ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేయడంతో ఇరువర్గాలను శాంతింపజేసేందుకు పోలీసులు ప్రయత్నించారు.

## ముగిసిన జాతీయ సేవా పథక శిబిరం



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం

బోయినపల్లి రూరల్ మే 7 : మండలంలోని తడగొండ గ్రామంలో బాబూ జగ్జీవన్ రామ్ వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం కార్యక్రమాన్ని వారం రోజుల పాటు నిర్వహించారు. ఈ కార్య క్రమంలో భాగంగా గ్రామ సర్వే, పశు వైద్య శిబిరాన్ని నిర్వహించి పశువుల్లో సంభవించే వ్యాధుల నిర్మూలనపై వివరించారు. అలాగే వయ్యారిభామ దాని నష్టాలపై అవగాహన, స్వచ్ఛతా హీ సేవ, డ్రగ్స్ నిర్మూలన కార్యక్రమాలు చేపట్టారు. రైతులకు పంట యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా పట్టు పరిశ్రమ, ఉద్యానవన అధికారి లత, వ్యవసాయ పరిశోధన సంచాలకులు లత, వ్యవసాయ కళాశాల అసోసియేట్ సునీత దేవి, అదనపు వ్యవసాయ సంచాలకుడు రామారావు, వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త ఉషారాణి, మండల వ్యవసాయ అధికారి ప్రణిత, మండల పశు వైద్య అధికారి సతీష్, జిల్లా ఏరువాక కేంద్రం కో–ఆర్డినేటర్ మధన్ మోహన్ రెడ్డి, మాజీ సర్పంచ్ రమేష్, మాజీ జడ్పీటీసీ లక్ష్మిపతి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసిన ఏజీపీ

వేములవాడ, మే 7 : రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీరజను వేములవాడ సీనియర్ సివిల్ కోర్టు ఏజీపీ బొడ్డు ప్రశాంత్ కుమార్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల జిల్లా న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టిన తరుణంలో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేసినట్లు తెలిపారు.



మొక్కను అందజేస్తున్న ఏజీపీ బొడ్డు ప్రశాంత్ కుమార్

నమస్తే తెలంగాణ CLASSIFIED

LOST

★ తేది:06/05/2025, మంగళవారం రోజున గోదావరిఖని బస్టాండ్ నుండి మా ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యంలో నా యొక్క ఒరిజినల్ SSC Long Memo (Roll No.2307103604) పోయినది. దొరికిన వారు సంప్ర: పాటిల్ అధర్వ S/o. పాటిల్ ఆనంద్. సెల్ :7780668649
NTK-330404

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189